

# కాత్యాయని

'వాసిష్ఠ'

యాజ్ఞవల్క్యమహర్షి ఆశ్రమం. ఆశ్రమానికి ఎదురుగా విస్తారములయిన గోశాలలు. తూర్పు దిశగా పెద్ద మైదానంలో కట్టబడిన శిష్యలోకం పర్ణశాలలు. ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న గోముఖీ నది. నదిని ఆశ్రయించి ఇరువైపుల కనుచూపుమేర విస్తరించి ఉన్న భూములు. దక్షిణ దిశగా విస్తరించిఉన్న ఫలవృక్షారామాలు — ఇవి యాజ్ఞవల్క్య మహర్షి ఆశ్రమం ఆకారవర్ణనలు.

అప్పుడు ఉషఃకాలం. అరుణుడు ఉదయించాడు. అతని ముఖనిర్గతములయిన అరుణకిరణాలు లేత గులాబీరంగు కలిగి సంధ్యచీకట్లతో మేళవిస్తున్నాయి! గైరికధాతుశోభితమైన పెనుకొండలవలె మేఘ

మాలికలు నింగిని పయనిస్తూ బాలభానుని మార్గాన్ని సరళం చేస్తున్నాయి!

ఆశ్రమవాసులందరు స్నానంకావించి, సంధ్యా వందనాది క్రియలు జరిపి, గుర్వాశ్రమానికి దగ్గిరగా ఉన్న యాగశాలలో నియమితస్థలాల్లో కూర్చొని ఉన్నారు!

గురుపత్ని బ్రహ్మవాదిని మైత్రేయి యాగశాలలో ప్రవేశించింది. ఆమె విశాలసాంద్రములైన కేశజాలాలు మేఘభ్రాంతిని కలిగింప, ఆమె ముఖమండలం షోడశకళలతో కూడిన చంద్రునివలె పవిత్రమై, మనోహరమై కనపడుతూంది! ఆమె పవిత్రతలో స్వాహాదేవి. గాంభీర్యంలో పర్వతపుత్రి. రూపంలో శచీదేవి. విద్యలో సరస్వతి. ఆమె ఉపదేశించింది.

"వత్సలారా! మన ఆశ్రమానికి గర్వకారణమైన ఒక వార్త మీకు నేను వెల్లడిచేసే ఆనందాన్ని అనుభవిస్తున్నాను. భగవాన్ మన గురుదేవుడు, రాజర్షి జనకమహారాజు సభలో అశేష బ్రహ్మవేత్తల్ని తృప్తిపరిచి, మహత్తర వాక్ప్రభావసమ్మిళిత జ్ఞానతేజోరాశి, బ్రహ్మవాదిని, మాతృమూర్తిగార్గిని సంవాదంలో జయించి, సువర్ణఖురశృంగములుకల వేయి గోవులతో ఆశ్రమానికి ఈ దినం సూర్య భగవానుడు పడమరగా నాలుగు బారలు పయనించే లోపుగా రాబోతున్నారు! ఆశ్రమానికి సంబంధించిన గోశాలలోని గోవుల్ని అగ్నిముఖక్రియ జరిగిన వెంటనే వేరు స్థలానికి తరలించి, శాలల్ని శుభ్రపరచ వలిసినదిగా కోరుతున్నాను. గురుదేవుని యథోచితంగా సత్కరించి ఆహ్వానించే బాధ్యత మన అందరిమీద ఉందని నేను వేరుగా చెప్పనక్కరలేదు. ఇక అగ్నిముఖక్రియ ప్రారంభింపవచ్చును." ఆపైన ఆమె త్రేతాగ్నుల వేదికల పక్కగా నిలబడింది.

అందరును "గురుదేవునికి జై!" అని జయనాదం కావించి తమ ఆనందాన్ని వెల్లడించారు.

అగ్నిముఖక్రియ వేదఘోషణతో ప్రారంభమయింది!

* * *

"సోమా, కాత్యాయిని ఎక్కడ కనపడలేదేమి?"

"ఈ పొదల్లో దాక్కొని ఉంటుంది." అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు సోమశ్రవస్సు.


వీరిద్దరితోపాటు మరి నలుగురు మనుష్యు లున్నారు. అందరు పొదల్ని గాలించసాగారు. కాత్యాయిని కనబడలేదు.

"ఎంత వేగంగా పరిగెత్తిందోయి! లేడిలా దాట్లు వేసుకొంటూ మన కంట్లో కారం జల్లింది!" అన్నాడు వసుమిత్రుడు.

"అల్లదిగో ఒక స్త్రీ ఆకారం ఆశ్రమాభిముఖంగా పరిగెత్తుతూంది! అల్లదిగో! ఆ పొదమాటున దాగి ఉండిన దానిని మనం గుర్తించక పరుగుపరుగున సహస్ర పదదూరానికి ముందుగా వచ్చేశాం! ఈ అవకాశాన్ని తీసుకొని కాత్యాయిని మనల కందకుండా పరుగు తీసింది!" అన్నాడు సోమశ్రవస్సు.

"పదండి వెంట తగులుదాం." అని ముందుగా పరుగు లంకించుకొన్నాడు వసుమిత్రుడు.

అప్పుడు సూర్యభగవానుడు సిందూరారుణ శోభతో పడమటి దిక్కున గోళాకారంగా కనిపిస్తున్నాడు! పిల్లగాలులు శాలలకు మరలి






వస్తున్న గోవుల పదఘట్టన ధూళిని నభోసీమని వయనింపచేస్తున్నాయి! ఆ ధూళిమండలం పశ్చిమాశాకాంత ఎర్రని చీర కుచ్చెళ్లతో మేళ మాడుతూ వింత కాంతితో మెరుస్తూంది!

కాత్యాయిని వెనుదిరిగి చూచింది. తనను సమీపిస్తున్నారు మనుష్యులు! ఆమె ఆత్రతతో ముందుకు చూచింది. గోశాలలు, వాటి దగ్గరగా శ్వేతాంబరధారిణియైన ఒక స్త్రీమూర్తి ఆమెకు కనిపించాయి!

"భగవతీ, శరణం దేహి!" అని కాత్యాయిని ఆ స్త్రీ పాదాలపై పడిపోయింది!

"వత్సా, ఏమీ భయంలేదు." అని ఓదారుస్తూ ఆ స్త్రీ ( మైత్రేయి ) కాత్యాయినిని పొదివి పట్టుకొని లేవనెత్తింది.

అప్పుడు సంధ్యచీకట్లు పలచబడి వెలవెల పోతున్నాయి! నెమరు వేస్తున్న గోమాతలు ఒక్క మారుగా బుస్సలు పెట్టాయి! మైత్రేయి అనుమాన దృక్కులతో తిరిగి చూచింది! ఎదురుగా ఆరుగురు ముష్కరులు కనిపించారు!

"ఎవరు మీరు?" అని గంభీరధ్వనితో ప్రశ్నించింది మైత్రేయి.

"మాతా! మేం ఈ స్త్రీని వెంటాడుతూ వచ్చాం. ఈమె నా సొత్తు. ఈమెని నా కిచ్చి వివాహం చెయ్యడానికి నిశ్చయించాడు ఈమె సగర్భ్యసోదరుడు ఆర్యసోమశ్రవస్సు!" అని చెప్పాడు వసుమిత్రుడు.


మైత్రేయి కాత్యాయినివైపు చూచింది. సంధ్య చీకట్లో చందమామవలె మెరుస్తున్న కాత్యాయిని ముఖం వెలవెలబోయింది. ఉన్నతమైన ఆమె విశాల వక్షోభాగం ధావనాయాసంతో కదిలిపోతూంది! పిరుదులవరకు జీరాడుతూన్న ఆమె వినీలకచభరం చిందరవందరగా వాతోద్ధూత మేఘమాలికవలె పొర్లాడుతూంది! ఆమె గద్గదస్వరంతో

"అమ్మా! నా వరణస్వాతంత్ర్యాన్ని దూషించాడు నా సోదరుడు! అష్టోత్తర శతధేనువుల్ని ఆశించి నా కిష్టంలేని వివాహాన్ని తలపెట్టాడు నా తోడబుట్టిన వాడు!" అని చెప్పింది.

"మాతా! ఈమె మాటలు విశ్వసించకండి. ఈ మాటలు ఆమె అనాలోచిత బాల్యవదనంనుండి నిర్గతములని నమ్మండి! తల్లిదండ్రులులేని ఈ పిల్లను నేను పెంచి పెద్దదాన్ని చేశాను. మేమిద్దరం ఒక తల్లిబిడ్డలం. ఈమె మంచిచెడ్డల్ని విచారించే హక్కు నాకుందని మనవి చేసుకొంటున్నాను. నా చెల్లెల్ని నాకు అప్పచెప్పండి" అన్నాడు వినయంతో సోమశ్రవస్సు.

మైత్రేయి ఏమీ చలించకుండా గంభీరంగా ఇలాగంది.

"ఆర్యా, విరుద్ధాభిప్రాయాలు కల మీ ఇద్దరి వివాదవిషయం పూర్తిగా కులపతులవారు విమర్శించ వలసిందిగా ఉంది! ప్రస్తుతం మీరందరును మీమీ ఇళ్లకు వెళ్లిపొండి. రేపు మధ్యాహ్నకార్యకలాపాలు నెరవేర్చుకొన్న తరవాత కులపతులవారు ఈ బాలిక విషయాన్ని విచారించగలరు. ఆ సమయంలో మీరు వచ్చి మీ అభిప్రాయాలు వారి సన్నిధానంలో విన్నవించుకోవచ్చును."



అలపడని స్వేచ్ఛ — ఫోటో—ఎ. ఎమ్. హుస్సేన్ (మద్రాసు-14)

వసుమిత్ర సోమశ్రవస్సులు ఒకరినొకరు చూచు కొన్నారు. వారి దృష్టుల్లో విసుపు, జుగుప్స మిళితమై ప్రకాశించాయి.

"అయితే, మేం వెళ్లవలసిందేనా? అదే మీ నిర్ణయమా?" అని క్రోధదృక్కులతో కాత్యాయినిని చురచుర చూస్తూ పలికాడు వసుమిత్రుడు.

"నా నిర్ణయం అంతే! మీరందరును రేపు మధ్యాహ్నం రావచ్చును." అని ఖచ్చితమైన స్వరంతో పలికింది మైత్రేయి.

"సరే, మీ నిర్ణయానికి మేం బద్ధులమై ఉంటాం. కాత్యాయినిని మా వెంట పంపివెయ్యండి. ఆమెతో కలిసి మేం రేపు మధ్యాహ్నం వస్తాం." అన్నాడు సోమశ్రవస్సు.

మైత్రేయి కాత్యాయినివైపు చూచింది. ఆమె భీతదృక్కుల్లోని అభిప్రాయాన్ని గ్రహించి మైత్రేయి ఇలాగంది.

"ఆర్యులారా, కాత్యాయిని చాల భయపడి ఉంది. ఇప్పుడామె మీతో రాజాలదు. నా దగ్గరనే ఈ రాత్రి ఉంటుంది. మీరు వెళ్లిరండి."

వారందరును అయిష్టంతోనే వెళ్లిపోయారు.

* * *

పూర్ణచంద్రుడు నభోమధ్యంలో తారాగణాలతో ప్రకాశిస్తున్నాడు! గాలి స్తంభించి పోయింది. చెట్లు, చేమలు చల్లని వెన్నెలలు మైమరిచి కాబోలు కదలిక లేక సమాధిలో ఉన్న యోగుల చిత్తంవలె స్థిరంగా ఉండిపోయాయి!

పూర్ణసమాధిలో ఉండిన మహర్షి కళ్లు విప్పాడు. అతని శరీరం చెమటతో తడిసిపోయింది! ఆచమనం చేసుకొని లేచాడు. త్రేతాగ్నులకు ప్రదక్షిణంగా వచ్చి చేతులు మొగిడ్చి నమస్కరించాడు! ఆశ్రమబహిః ప్రవేశానికి వచ్చాడు మహర్షి!

తమ గురుదేవుని చూచాయి గోమాతలు! సంతోషంతో గంగడోళ్లు ఆడించుకొంటూ బుస్సలు పెట్టాయి! మహర్షి ప్రఫుల్లవదనంతో

గోశాల సమీపించాడు. ఇంతవరకు స్తంభించిన వాయుదేవుడు ఒకమారు విజృంభించాడు! ఉన్నట్లుండి ఆశ్రమోపాంత వృక్షాలు పురి విప్పుకొని ఆడే నెమళ్లగుంపువలె వెన్నెలలో నాట్యమాడ బొచ్చాయి! మహర్షి గోవులనన్నింటినీ పరామర్శించి, పచ్చగడ్డిని వాటిముందరవేసి, ఆశ్రమంవైపు నడక సాగించాడు!

ఆశ్రమం విశాలాంగణంలో మహర్షి కళ్ళు చెదరగొట్టే ఒక దృశ్యం! మహర్షి చేతిలోని కమండలువు అప్రయత్నంగా నీరు ఒలకబోసింది! మహర్షి కళ్ళు కూడా ఆశ్చర్యవిచలిత దృక్కుల్ని ఒలకబోశాయి! అతని విశాల వక్షస్థలం వాయుపూరితమై బిగుసుకొని పోయింది! ఫాలం ఆలోచనా తరంగాలతో కాబోలు ముడుతలు పడ్డది.

ఆ దృశ్యమేది?

మైత్రేయి మంచంపైన పద్మాసనం వేసుకొని ధ్యానముద్రలో శంకరునికై తపస్సు చేస్తున్న శైలపుత్రికవలె తేజోవంతంగా కనిపించింది.

ఆమె మంచానికి దగ్గరగా మరొక మంచంపై ఒక నవయౌవనాంగి ఒడ్డింపుగా పడుకొని గాఢమైన నిద్రలో ఉంది! స్వర్ణఘటములవంటి ఆమె స్తనాలయుగళం నిరాచ్ఛాదనమై చంద్రకాంతితో మంతనం చేస్తూ మెరిసిపోతున్నది! ఆమె కంఠసీమ వెన్నెలకాంతితో మేళవించి, రెట్టింపు శోభతో లావణ్యతరంగమాలికవలె మనోహరంగా కనిపిస్తూంది! ముడుచుకొని ఉన్న ఆమె కనుదమ్ములు చంద్రుని చూడజాలక తలవాల్చిన తామరమొగ్గలవలె నయన పర్వంగా ఉన్నాయి! సగం విచ్చుకొనిఉన్న ఆమె ప్రవాళాధరములమధ్య దానిమ్మవిత్తులవంటి దంతాల వరుస ఎరుపుతెలుపుల సమ్మేళనతో వెన్నెల్ని ధిక్కరిస్తూంది. విధాతచే నేర్పుగా మలిచిన దంతపు బొమ్మవలె ఉన్నదా బాలిక!

"ఎవరీ సుందరబాలిక?" అని మహర్షి మనస్సు ప్రశ్నించింది.

"స్వర్లోకంనుండి దిగజారిన అప్సరసా?" అని మహర్షి మనస్సు శంకించింది.

"భారతీయ సురసుందరీ రూపానికొక జోహారు!" అని శబ్దించింది మహర్షి హృదయం.

ఆయన మనస్సు భావతరంగ కల్లోలమయమయింది. ఆ కల్లోలహృదయాకాశం అరుణరాగ రంజితమై జిగేలుమని మెరిసింది.

మహర్షి ఉలిక్కిపడ్డాడు. అతని ముఖమండలం ఎరుపెక్కింది.

"మైత్రేయీ!" అని బిగ్గరగా పిలిచాడు.

మైత్రేయి కళ్ళు విప్పింది. ఎదురుగా తన భర్త!

వెంటనే ఆమె దృక్కులు పక్కకి తిరిగాయి! అర్ధనగ్నశరీరంతో మైమరిచి నిద్రపోతున్న అందాలరాశి కాత్యాయిని కనిపించింది!

మైత్రేయి ఆందోళనతో లేచి తన పడకలోని తెల్లటి దుప్పటి తీసి కాత్యాయినికి కప్పింది!

"భగవాన్, మీరింకా విశ్రమించలేదా?" అని ప్రశ్న.

మహర్షి మెల్లిగా నవ్వాడు!

"నేనీరోజు. . . . . . గడ్డిపోచకంటే. . . చులకనై పోయాను."

మైత్రేయి అధరములపై చిరుహాసంవిరిసింది.

"భగవాన్! ఇందులో వింత ఏమిలేదు. మనస్సు విచిత్రభావాల కార్యాలయం! కొంగ్రొత్త భావాల్ని చిగురు దశలోనే త్రుంచి పారవెయ్యడం మీ వంటి మహనీయులకు విచిత్రమేమికాదు."

" 'స్థిరప్రజ్ఞుడవు' నీవని జనకరాజర్షి నన్ను గౌరవించాడు. 'సర్వజ్ఞుడవు' నీవని ఋషిలోకం నన్ను పూజించింది! ఈ రెండూ నాలో ఉన్నాయా? అని సందేహం నాకీ రాత్రి కలిగింది!" అన్నాడు మహర్షి నిట్టూర్పు విడుస్తూ.

"భగవాన్! ఈ రెండు మీ యందు పరిపూర్ణంగా ఉన్నాయి. సందేహం లేదు. కాని, అన్నిటికిని మించిన దైవికశక్తి మానవాతీతమై ఉంది కదా! అట్టిదేదో అజ్ఞాతశక్తి మిమ్మల్ని ఈ రోజు కలవరపరిచింది. అంతే"

మహర్షి బదులేమి చెప్పకుండా ఆకాశంవైపు నిశ్చలంగా చూచాడు!

"నాథా! తపోవ్రతాదులచే శుష్కించినా, ఈ నా శరీరం ఇంకా పూర్తి కళ కోల్పోలేదు. ఇదొకప్పుడు మీ పవిత్రాంతఃకరణను లోంగదీసుకొన్న గౌరవ చిహ్నం కలదే కదా! దీనిని ఈ రోజు మీ వశం చేసుకొంటున్నాను. ఆనందించి మీ తాత్కాలికమైన భావాన్ని జయించండి. భగవాన్ రుద్రుడు క్రోధావేశంతో మనోభవుని నిర్జించినా, పర్వతపుత్రిక వగలుమాత్రం జయించలేక పోయాడంటారు! దాంపత్యానికి ఆ మనోధైర్యం ఉండబట్టే అజేయమై సృష్టినాటి నుండి పవిత్రంగా నిలిచి ఉంది!" అని చెప్పి మైత్రేయి భర్తను సమీపించింది!

మహర్షి తన కమండలాన్ని కింద ఉంచి తన రెండు చేతుల్ని మైత్రేయి భుజాలపై ఉంచి,

"ప్రియా, నా భావం తాత్కాలికమే. అంత బేలతనం నాకు లేదు. సరే! ఈ బాలిక ఎవరు?" అని ప్రశ్నించాడు.

"నాథా, ఈమె బీదతపస్వి సుమిత్రార్యుని కుమార్తె. పేరు కాత్యాయిని. బీదకుటుంబంలో పుట్టిన ఈ బాలికను సౌందర్యలక్ష్మి వరించి ఆర్య కన్యకల్లో మణిపూసగా వెలయించింది. ఈమెకు తల్లిదండ్రులిద్దరు లేరు. ఈమె అన్న సోమశ్రవస్సు ఈమెకు సంరక్షకుడుగా ఉన్నాడు. ధనికుడైన వసుమిత్రుని గోధనాన్ని ఆశించి సోమశ్రవస్సు ఈ పిల్లను వానికిచ్చి వివాహం చెయ్యడానికి సిద్ధపడ్డాడు. ఈ బాలిక ఏలనో ఆ సంబంధానికి ఇష్టపడక గృహత్యాగం చేసింది. . ." అని వివరంగా జరిగిన విషయాన్ని చెప్పింది మైత్రేయి.

"మైత్రేయీ!" అని పిలిచాడు మహర్షి.

"నాథా!"

"నేనొక నిర్ణయానికి వచ్చాను. తపోవ్యసనచిత్తవైన నీకది సమ్మతమై ఉంటుందనే నా విశ్వాసం."

మైత్రేయి గలగలమని నవ్వింది! ఉల్లాసంగా మహర్షి గడ్డాన్ని దువ్వుతూ ఇలాగంది.

"స్వామీ, పతికి సుఖాన్ని ఇవ్వడమే సతికి ధర్మం. మీ నిర్ణయాన్ని చెప్పండి."

"నా నిర్ణయం పర్యవసానం ఈ బాలిక ఇష్టంపైన ఆధారపడిఉంది. నాలో ఉదయించిన వికృత భావానికి అదే సరియైన ప్రాయశ్చిత్తం. నేనీ బాలికను —ఆమె పూర్ణంగా ఇష్టపడినప్పుడు —వివాహం చేసుకో నిశ్చయించాను. నీవేమంటావు?"

"నాకు పరమతృప్తి అని అంటాను." అని మహర్షి గుండెలపై చేరగిలబడింది ఆ పరమసాధ్వి మైత్రేయి!

• • • •

"కాత్యాయినీ! నీ భావిని ఎలా నిర్ణయించుకొన్నావు? వసుమిత్రుడు చాలా ధనికుడు! మంచివాడనే వినికిడి! నీవు వానిని ఎందుకు తిరస్కరిస్తావు?" అని మైత్రేయి ప్రశ్నించింది.

"అమ్మా, మీరడిగిన ప్రశ్నకు నేను సమాధానం ఇవ్వలేకున్నాను. కమలం చంద్రరశ్మిని సహించలేదు! నీలోత్పలం సూర్యరశ్మికి ఓర్వజాలదు! ఏదో అలాంటి భావమే నన్ను ఆర్యవసుమిత్రునివైపు మొగ్గనీయకున్నది! ఇక నాభావిని గురించి —నేనెవర్ని ప్రేమించి ఉండలేదు. నా జీవితాన్ని తపోవృత్తిలో గడుపుదామని తలుస్తున్నాను." అని బదులిచ్చింది కాత్యాయిని.

"అసలు నీకు వివాహం పైననే ఇష్టంలేదా?"

"నేను గృహత్యాగం చేసినప్పుడు నాకలాంటి భావమే ఉండింది. కాని ఇప్పుడు..... !" అని మీద చెప్పలేకపోయింది.

"చెప్పమ్మా చెప్పు. నాదగ్గిర దాపరికంవద్దు. నేను నీ సహోదరి స్థానంలో ఉన్నాను. భయంగాని, సిగ్గుగాని వద్దు."

"అమ్మా, మీతో ఎలా చెప్పడం?" అని గుడ్ల నీరు కుక్కుకొంది కాత్యాయిని.

"వత్సా, అనుబంధాన్ని పాంచభౌతిక శరీరధారులమైన మనం ఊహించలేము. మానవుడు తన్నుతాను గుర్తించుకోనంతవరకు, ఏదో అజ్ఞాతశక్తికిదాసుడవుతున్నాడు! ఈ అజ్ఞాతశక్తికి పూర్వజన్మవాసనలు దోహదమిస్తాయని పెద్దలంటారు! స్పష్టభాషలో చెప్పబోతే పూర్వజన్మ వాసనల బలమే మానవుని సంస్కృతిబంధంలో నడిపిస్తుంది! నేను ఒకటి నిన్ను ప్రశ్నిస్తున్నాను. విను. నీవుగాని మహర్షిని ప్రేమిస్తున్నావా?"

"కాత్యాయినికి తన తలపై ఏదో బ్రహ్మాండమైన బరువు పడినట్లయింది! ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ మైత్రేయి ఒడిలో తల దూర్చుకొంది!

మైత్రేయి ఆమె కురుల్ని సవరిస్తూ

కాత్యాయినీ! నీకోరిక నెరవేరుతుంది. నీవు సందేహించక ఉల్లాసంతో ఉండు" అని చెప్పింది.

"కాత్యాయిని ఆనందభారంచే మైత్రేయిని కౌగలించుకొని తృప్తితీరా ఆనందబాష్పాల్ని రాల్చింది.

• • • •

ఆరోజు మధ్యాహ్నం కులపతి యాజ్ఞవల్క్య మహర్షి ఆశ్రమంలో ధర్మనిర్ణయసభ కూడింది.

ఆర్యసోమశ్రవస్సు తన అనుయాయులతో సరిఅయినవేళకు సభకు వచ్చాడు. కులపతిని చూచి ఇట్లు చెప్పాడు.

"భగవాన్, ఇతడు ఆర్యవసుమిత్రనామధేయుడు. ఇతనికి విస్తారమైన గోసంపద కలదు. మా జనపదానికి

భోజ ( పాలకుడు ) బిరుదాంకితుడు. ధనికుడు, భోజుడు అయిన ఇతడు మా కాత్యాయనీకుమారిని చూచి మనస్సుని జారవిడుచుకొని, నాతో వివాహ విషయంగా ప్రస్తావించాడు. 'నా చెల్లెలికి ఇంతకంటె గొప్ప సంబంధం దొరుకుతుందా?' అని తలచి నేను ఇతనికి మాట ఇచ్చాను. ఆర్య సంప్రదాయాను సారం కులకన్యక తన వైవాహిక జీవిత విషయమై పెద్దల నిర్ణయానికి కట్టుబడి ఉంటుంది! నేను, నా చెల్లెలి విషయంలో అట్టి విశ్వాసం ఉంచుకొని, ఆమెతో ప్రస్తావించకుండానే ఆర్య వసుమిత్రునికి మాట ఇచ్చాను. అజ్ఞానవశంచేత తాత్కాలిక భావోద్రేకానికి లొంగి నా చెల్లెలు గృహత్యాగం చేసింది! ఆ తప్పు నేను క్షమించి తిరిగి ఆమెను తీసుకొని పోవడానికి వచ్చాను. నా చెల్లెల్ని నాకు అప్పచెప్పాలని భగవచ్చరణ సన్నిధానంలో మనవి చేసుకొంటున్నాను."

"ఆర్య సోమశ్రవస్! వివాహబంధం పవిత్రమైన క్రియ. అట్టి క్రియాచరణకు ముందుగా సంప్రదాయసిద్ధమైన ఆచరణ ఉండాలి. మొదట కన్యక అభిప్రాయాన్ని తెలుసుకోవాలి. రెండవది జనపద ముఖ్యులకు ఈ విషయాన్ని తెలియపరచాలి. మూడవది కన్యకతోసహావచ్చి నీవు ఆమె వివాహాన్ని గురించి కులపతికి తెలియపరచాలి. ఇన్ని ఘట్టాలు గడిచిన తరవాత అగ్నిసమక్షంలో వివాహప్రక్రియ జరగాలి. వీటినన్నిటిని నీవు పాటించావా?"

". . . . . . . ." సభలో మౌనం.

"ఇట్టి ప్రాథమిక క్రియలు జరగలేదని మీ మౌనం వ్యాఖ్యానిస్తోంది. కులకన్యక పెద్దల నిర్ణయానికి కట్టుబడి ఉండాలన్నది గౌణమే అవుతుంది కాని నిర్బంధం కాజాలదు."

"భగవాన్, నా చెల్లెలి అభిజాత్యంపై విశ్వాసం చేత మాట ఇచ్చాను."

"విశ్వాసం వేరు. క్రియాచరణ వేరు. పోనీ, మాట ఇచ్చిన తరవాతైనా నీవు నీ చెల్లెలితో సంప్రదించావా?"

"సంప్రతించాను. ఆమె ఆర్యవసుమిత్రుని వివాహం చేసుకోడానికి సమ్మతించలేదు."

"ఆమె ఇష్టం లేకున్నప్పటికీ నీవు బలాత్కారంగా వివాహం తలపెట్టడానికి తీర్మానించావు. అంతేనా?"

"ఈపాటిదానికి నా చెల్లెలు గృహత్యాగం చెయ్యడం ధర్మంకాదు భగవాన్!"

"గృహత్యాగం చెయ్యడం తప్పేను! ఇష్టంలేని వివాహం చేసుకొని కాలుజారి చరించడం కూడా తప్పేను! ఇందు ఏ తప్పు మేలో నీవే ఆలోచించు."

"భగవాన్! ఆర్యసోమశ్రవస్సుకు నేను నూటఎనిమిది గోవుల్ని ఇచ్చాను. కాబట్టి నాకాకన్యకపైన అధికారం సంక్రమించిందని నా మనవి." అని వసుమిత్రుడు లేచి వినయంగా చెప్పాడు.

"కన్యకకు ప్రతిగా గోవునిచ్చి ప్రతిగ్రహించడం ధర్మమే. కాని, నీవు నూటఎనిమిది గోవుల్ని ఇచ్చి దానికి ప్రతిగా ఇష్టంలేని ఒక బాలిక పాణిని అధికారయుక్తంగా అడగడం ధర్మం కానేరదు. అది లంచమే అవుతుంది."

కులపతి మైత్రేయుని ఉద్దేశించి —


"కన్యక కాత్యాయని ఎవరినైనా ప్రేమించినదా? అడిగి తెలుసుకో." అని ఆదేశించాడు.

"భగవాన్! నేను తెలుసుకొన్నాను, తానింకా

(తరువాయి 62 వ పేజీలో)














ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కార్టూన్ల పోటీ—

# లోకోక్తి చిత్రిక

యుగయుగాల జీవితానుభవం నింపుకున్న రసగుళికలు సామెతలు. వానికి వ్యాఖ్యలుగా భాసించే కార్టూన్ల పోటీ ఒకటి ఆరంభిస్తున్నాము.

పాఠకులలోని కళాభినివేశాన్ని ప్రోత్సహించడమే దీని ఉద్దేశం.

మేమిచ్చిన సామెతకు వ్యాఖ్యగా ఓ కార్టూన్ గీసి పంపాలి.

ఆ కార్టూన్ సామెతకు ఉన్నదున్నట్టు చిత్రీకరణ కారాదు. ఆ సామెత ఉపయోగిస్తే సరిగా సరిపడే ఏ సందర్భమైనా తీసుకొని వ్యంగ్యంగా చిత్రించాలి.

అలా గీసి మాకు పంపిన కార్టూన్లలో ఉత్తమమైనదానికి రూ 20 బహుమతి ఇస్తాము. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము.

ఉత్తమం అని నిర్ణయించేది ఎడిటరే. అదే ఆఖరు నిర్ణయం. ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

బహుమతి పొందని చిత్రాలను వెనక్కు పంపలేము.

## లోకోక్తి చిత్రిక-1

"అత్తమీది కోపం
దుత్తమీద చూపిందట."

పై లోకోక్తిని ఆధారం చేసుకొని కార్టూన్ గీసి పంపవలసిన ఆఖరు తేది జూన్ 15.

తొలి చిత్రం ప్రచురితమయినప్పటి నుంచి వారం మార్చి వారం ఈ శీర్షిక నిర్వహించాలని మా సంకల్పం.

—ఎడిటర్

# కాత్యాయని

(51 వ పేజీ తరువాయి)

వివరిని ప్రేమించి ఉండలేదని చెప్పింది కాత్యాయని."

"భగవాన్! నా చెల్లెలి విషయంగా అన్ని బాధ్యతల్ని నేను వదులుకొంటున్నాను. ఆమె నా గృహానికి రానవసరం లేదు." అన్నాడు క్రోధంతో సోమశ్రవస్సు.

కులపతి కొద్దిగా మందహాసం చేసి అన్నాడు.

"సోమశ్రవస్! బాధ్యతల్ని నీవు వదులుకొన్నా, రక్తంతో మిళితమై వస్తూన్న బాధ్యతలు మాత్రం నిన్ను వదిలి పోజాలవు! కోపాన్ని పరిత్యజించు. నీచెల్లెలు భయంకరమైన తప్పేమి చేసి ఉండలేదు. నీవు నన్ను ఒంటరిగా సాయంకాలం కలుసుకో. కాత్యాయనిని గురించిన విషయాలు సమగ్రంగా చర్చించుకొందాం." అట్లు చెప్పిమహర్షి వసుమిత్రుని ఉద్దేశించి ఇలాగన్నాడు.

"అర్యా, నీవు నష్టపడిన గోధనం మా ఆశ్రమంలోంచి నీకు పంపబడుతుంది. నీవు నిర్మల చిత్తంతో వెళ్ళిరా!"

అంతటితో సభ ముగిసింది.

* * *

సత్యసంధులకు, పరతత్త్వ విజ్ఞాన వివేచనులకు మనస్సు జారి కలుషితం కాకూడదు! అట్లొకవేళ విచలితమై అయిందా, దానికి తగిన ప్రాయశ్చిత్తం జరగవలసిందే! ఆధునికయుగంలో మహాత్ముడు తన ఆశ్రమంలో జరిగిన తప్పిదానికి ఉపవాసవ్రతం పూనడం జరిగింది. అదే సత్యసంధుల పంథా!

యాజ్ఞవల్క్య మహర్షి తన ధర్మపత్నితో ఆలోచించి కాత్యాయనిని వివాహం చేసుకొనడమే తన కలుషిత చిత్తానికి ప్రాయశ్చిత్తమని తీర్మానించాడు! భావనాబలంవల్ల మనస్సు వ్యభిచరించడం కూడా ధర్మవిరుద్ధమని తలంచాడు ఆ పరమ నైష్ఠికుడు! తన తప్పిదాన్ని గుప్తపరచకుండా బైట పెట్టి సత్యసంధులకు మార్గదర్శకుడయ్యాడు!

మహర్షితో కాత్యాయని వివాహం యథావిధిగాను, నిరాడంబరంగాను నెరవేరింది!

కాత్యాయని ఆదర్శగృహిణిగా కీర్తిని పొందింది! ఆమెకు పరతత్త్వచింతనలో విశేష పరిజ్ఞానం కలగక పోయినా, భర్తే దైవమని నమ్మిన పరమ పతివ్రతా శిరోమణిగా వెలసింది!

ఈ విధంగా మధురమైన వసంతాలు అనేకములు దొర్లిపోయాయి!

* * *

ఒకనాడు మహర్షి తపోనిష్ఠకై సిద్ధపడుతున్న మైత్రేయిని సమీపించాడు.

మైత్రేయి తన భర్తకు స్వాగతం పలికి ఆసనము అమర్చింది. మహర్షి ఆసనాన్ని అలంకరించి

"ప్రియా! నీతో కొన్ని ముఖ్య విషయాల్ని ప్రస్తావించడానికి వచ్చాను. ఇది మామూలు ప్రస్తావనకాదు. అభ్యర్థించుటకే వచ్చాను!" అని అన్నాను.

"భగవాన్! సెలవివ్వండి. అభ్యర్థన అవసరం లేదు. మీరు నన్ను ఆజ్ఞాపించవచ్చును." అని బదులిచ్చింది.

"ప్రియా! కాత్యాయని సాంగత్యంలో నేను గార్హస్థ్యం పరాకాష్ఠ చూశాను. తృప్తిని పొందాను కూడా! ఇప్పుడు నాను నాను నాదృష్టి అంతర్ముఖమై పోతూంది! కాబట్టి నేనిట్టి స్థితిలో గార్హస్థ్యధర్మాల్ని పాటించడానికి అశక్తుణ్ణైపోతున్నాను. ఇలాంటి పరిస్థితిలో నేను సన్న్యాసం పుచ్చుకొని ఆత్మానుసంధాన క్రియలో లీనమైపోవాలని సంకల్పించాను.

"మైత్రేయీ! నీవు నా ప్రథమ కళత్రానివి. నీ అనుజ్ఞ లేనిదే నేను సన్న్యాసం పుచ్చుకోడానికి వీలు పడదు! అది శాస్త్రమర్యాద. కాబట్టి నీ అనుజ్ఞ యాచిస్తున్నాను!

"అపారమైన నా ఆస్తిని నీకును, కాత్యాయనికి సమంగా పంచిపెట్టడానికి తీర్మానించాను."

మైత్రేయి కళ్ళు మూసుకొని కొన్ని నిమిషాలు ధ్యానించింది. ఆమె పవిత్రమైన ముఖమండలాన్ని తదేకదృష్టితో చూస్తూ ఉండిపోయాడు మహర్షి.

"భగవాన్! సవ్యమైన మీ నిర్ణయానికి నేను అడ్డు రాజాలను. నాకొక అనుమానం కలిగింది."

"అడుగు. సంకోచించనవసరంలేదు."

"స్వామీ! సంపత్తు అమృతత్వానికి దోహదమివ్వ గలదా?"

"ఇవ్వజాలదు. సంపత్తుకు, జ్ఞానానికి సంబంధం ఏమాత్రంలేదు. ప్రత్యుత బాధకమే అవుతుంది."

"అలాంటప్పుడు నాకు సంపత్తు అక్కర్లేదు. అమృతత్వ సాధనకు అనువైన మార్గాన్ని ఉపదేశించండి. మీరు నాకివ్వవలసిన ఆస్తి అదే."

"ప్రియా! నీ అంతస్తుకు తగిన కోరిక కోరావు. విను. ఆత్మను విడిచి ఏదీ ఉండజాలదు. భార్య భర్తను ఆత్మార్థమే ప్రేమిస్తుందేకాని భర్తనుద్దేశించికాదు. ఇదేవిధంగా సర్వం వ్యాఖ్యాతమౌతుంది. కాబట్టి అన్నిటిని మించినది నేను, అనగా ఆత్మ."

"స్వామీ! ఆత్మను అవగతం చేసుకొనే విధానాన్ని చెప్పండి."

"ఆత్మ చైతన్యభావమే ఆనందం. ఈ చైతన్యం హృదయంలో చేష్టించినప్పుడు జ్ఞానంగాను, బాహ్యంలో చేష్టించినప్పుడు సమస్తప్రకృతిగాను అనుభవానికి వస్తుంది."

"భగవాన్! బాగా బోధపరచండి."

"మనలోని ఒక్కొక్క ఇంద్రియం ఒక్కొక్క భావానికి గమ్యస్థానమై ఉంది. ఉదాహరణగా రసములన్నిటికిని జిహ్వ గమ్యస్థానమై ఉంది. ఇలాగే అన్నిటిని ఊహించుకో. ఆత్మ సదా ప్రజ్ఞాస్వరూపమై ఒప్పుతుంది. నీలో వృథ్వీజ్ఞానం నశించినప్పుడు ఆత్మ నశించదు సరికదా అత్యుజ్జ్వలంగా ప్రకాశిస్తుంది! అప్పుడది నిర్గుణ పరబ్రహ్మగా భాసిస్తుంది. ఆత్మ తెలివిగాని తెలియబడునదికాదు. కాబట్టి సాధనతో తెలివిని సాధించాలి కాని తెలియచెప్పే శాస్త్రజ్ఞానం పనికిరాదు."

యాజ్ఞవల్క్య మహర్షి ముఖంగా బ్రహ్మవాదిని మైత్రేయి అమృతత్వాన్ని పొందగలిగే ఆత్మ విచారాన్ని సమగ్రంగా తెలుసుకొని తృప్తిని పొందింది.

మహర్షి సమస్తమైన ఆస్తిని కాత్యాయని వరం కావించి, సన్యసించి ఆశ్రమం విడిచి హిమాచలానికి పయనమై వెళ్ళిపోయాడు! ★